## కామెడీ కథ


# ఎండాకాలం.

# సాయంత్రం ఆరు గంటలైంది.

**పార్కులో ఎప్పట్లాగే జనసందోహం తక్కువగా వున్నచోట కూర్చున్నారు సుకన్యా, కూర్మావతారాలు. మోకాళ్ళమీద గెడ్డమానించి అలవాటు ప్రకారం గడ్డిపరకలు పీకుతోంది సుకన్య. అలవాటు ప్రకారమే ఆమెకెదురుగ్గా మఠం వేసుగ్గూర్చుని ఏడుపుమొహంతో ఆమెవంకే చూస్తూ సడెన్గా గుర్తొచ్చినట్ట న్నాడు కూర్మం వురఫ్ కూర్మావతారం.**

''సుక్కూ! జీవితం బుడగస్య బుడగః! అన్నాడో మహానుభావుడు. అంచేత...''

''ఆగాగు ఈ కొటేషనెక్కడా విన్నట్టు లేదే! 'జీవితం బుద్బుదప్రాయమని' ఏ మహానుభావుడో, ఏనాడో సెలవిచ్చాడని విన్నాను'' తానూ సడెన్గా తలెత్తి అన్నది సుకన్య.




''ఏదో ప్రాయంలేద్దూ! ఇక్కడ మన ప్రాయాలు ముదిరి నేను బెండకాయలా నువ్వు బీరకాయలా ముదిరిపోతున్నాం. ముందిది ఆలోచించు. నువు తెలుగు పండిట్వవటంగాదు గానీ నీతో మాట్లాడలేక ఛస్తున్నావు. నేనసలే తెలుగులో వీక్కూ. అంచేత త్వరలో మనవూ పెళ్లి చేసుకుని ఇల్లు చూసుకుని వెచ్చగా కాలం గడుపుదావంటాను. ఇప్పటికేడేళ్ళుగా ఈ పార్కులో గడ్డిపరకలు పీక్కుంటూ వేళ్ళు కాయలు లేచాయి. కాలక్షేపానికి పల్లీలు, బఠాణీలూ తినీ తినీ ఐదేళ్ళలోను ఐదు కిలోలు పెరిగాను. మన ప్రాయమంతా ఈ పార్కు గాచిన వెన్నెలైపోతోంది. ఇప్పటికైనా గ్రీన్సిగ్నల్ ఇస్తావా పెళ్ళికి! ఈ గార్డెనర్ వెధవ, వాడికి గడ్డి పీకే పని తప్పించామని మనం కనబడగానే పళ్ళికిలించటం నేర్చుకున్నాడు. ఒక్కోసారి నామీద నాకే జాలేసి 'ఒరే కూర్మంగా! నీ బ్రతుకిట్లా పార్కుపాలైందేమిట్రా?' అని ప్రశ్నించుకుంటుంటాను.''

''ఊర్కే అట్లా ఏడుప్మొహం పెట్టకు కూర్మం! నువ్వలా చిన్న'పిగ్లెట్లా' బుంగమూతి పెట్టి మాట్లాడుతుంటే ఎంతముద్దొస్తున్నావో తెల్సా! అసలు నువ్వు చిన్నప్పుడు ఆఫ్రికా పిగ్లెట్లా నల్లగా, బొద్దుగా, బుంగమూతితో ముద్దొచ్చేలా వుండబట్టే మీ బామ్మ నీకు ముద్దుగా 'కూర్మావతారం' అని పేరు పెట్టించుంటుంది''

''సర్లే! నిన్ను తలమునకలుగా ప్రేమించానుగా బట్టి నువ్వు ఏవన్నా భరిస్తాను గానీ ఇందాకేంటీ అన్నావు? ముద్దొస్తున్నానా? అయితే ఒక్క ముద్దివ్వరాదూ! ఈ పొద వెనకాలున్న మనమెవ్వరికీ కనబడం!''

''ఈ వెధవ కక్కుర్తి వేషాలే నాకు నచ్చవు! ఇట్లాంటి తిక్కవేషాలంటే నాకు సరిపడదని తెలియబట్టే నేను పెళ్ళొద్దంటూ ఐదేళ్ళుగా నిన్ను ప్రేమిస్తున్నా మా నాన్న ఏం మాట్లాడకుండా వూర్కున్నాడు. మనది అమర ప్రేమ కూర్మం! అంచేత మన ప్రేమలో ఆవేశకావేషాలూ, నిందలూ నిష్ఠూరాలూ, అపార్థాలూ, ద్వంద్వార్థాలూ వుండవు'' శూన్యంలోకి చూస్తూ తాదాత్మ్యంలో చెబుతోన్న సుకన్యని వారిస్తూ-

''ఏవిటన్నావ్? అమరప్రేమా? అంటే మనం చచ్చేదాక ఇలా ఈ పార్కులో గడ్డిపరకలు పీక్కుంటూ ప్రేమించుకుంటూనే వుంటామా? పెళ్ళీ, పెటాకులూ లేకుండా?'' ఆముదం తాగిన మొహంతో అడిగాడు కూర్మావతారం.

''చిన్నప్పుడు మీ బామ్మ నీకాముదం ఎక్కువ తాగించుంటుంది. లేకపోతే అట్లా ప్రతిదానికీ ఆవదం తాగినట్లు ఫేసు పెడతావేంటీ? ఛండాలంగా! మరీ జీవితాంతం గాదులే కానీ పెళ్ళి చేస్కుని మనం సుఖపడతామన్న నమ్మకం నాకింకా గట్టిగా కుదరలా. దానికింకా టైం పడ్తుంది''

''అంటే అక్కడికి పెళ్ళి చేస్కున్నవాళ్ళంతా అష్టకష్టాలూ పడుతున్నారని నీ వుద్దేశమా? ఈ పార్కులోని జంటల్ని చూడు! పిల్లలతో, వాళ్ళ ఆటపాటలాలకిస్తూ జీవితానందమంటే ఇదే! అన్న రీతిలో ఎంత వుల్లాసంగా వున్నారో! అసలు నీకు పెళ్ళంటే అంత విముఖత ఎలా కల్గిందీ? ఎవరైనా ప్రేమించుకుని, పెళ్ళి చేసుకుని సుఖంగా వుండాలనుకుంటారు. ఇలా జన్మంతా ప్రేమించుకుంటూ, పార్కులమ్మట తిరగాలని కోరుకునే శిఖండిని నిన్నే చూస్తున్నాను. నిన్నా బస్టాపులో చూసిన క్షణాన్నే నీమీద మనసు పారేసుకుని ఇలా చకోర పక్షిలా నీ ప్రేమకోసం, నీతో పెళ్ళికోసం నిరీక్షిస్తూ ఇలా పార్కులమ్మట పనీపాటా లేని చవట సన్నాసిలా తిరుగుతున్నాను'' ఉక్రోషంగా ముక్కుపుటాలు పెద్దవి చేస్తూ అన్నాడు కూర్మం.

''ఈ జంటలంతా సుఖంగా వున్నారనుకుని మోసపోకు. నలుగుర్లో ఆడే నాటకమిది. ఇంటికెళ్ళి చూడు. పెళ్ళాలంతా అర్జంటుగా పాతచీరల్లో దూరిపోయి వంటింట్లో కుస్తీలుపడుతుంటే, మొగుడు మహారాజులు బాంబేడయింగో, శంఖుమార్కో లుంగీల్లోకో దూకి, పొద్దున్న పూర్తిగాని పేపరు చేతిలోకి తీసుకుని 'ఏవే, నా మొహానో కాఫీ చుక్క తగలేస్తావా?' అంటారు. అదీ భాగోతం. పైపై మెరుగులు చూసి, మోసపోకు. పెళ్ళిలో సుఖమనేది, ఎండమావుల్లో నీళ్ళలాంటిది. తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు, కుక్కతోక వంకరను సరిచేయవచ్చుకానీ, పెళ్లైనాక, ఈ ప్రేమని మాత్రం బ్రతికించుకోలేం. అంచేత ఇలా ఇంకొంతకాలం హాయిగా ప్రేమించుకుంటూనే కాలక్షేపం చేద్దాం కూర్మం! ఇపుడు మనకేం లోటు? నీకూ నాకూ శుభ్రమైన వుద్యోగాలున్నాయి. నీ పెళ్లైతే నేగాని, నీ క్రిందవాళ్ళకి లైన్ క్లియరవ్వదన్న బాధ నీకు లేదు. నా సంగతంటావా! నా చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళయిపోయింది. నా కట్నం డబ్బు మా నాన్న బ్యాంకులో పడేసి, నా ఇష్టమొచ్చినప్పుడు పెళ్ళి చేస్కోమన్నాడు''

''ఏం లోటా? నీకు లేకపోవచ్చు. నా సంగతాలోచించావా అసలు? నా పెళ్ళికోసం కలవరించిన మా బామ్మ, నిన్ను తప్ప వేరెవరినీ పెళ్ళి చేస్కోనని భీష్మించుక్కూచున్న నన్ను పెళ్ళికొప్పించలేక ఆ బెంగతోనే, సెంచరీ చూస్తుందని అందరం అనుకుంటుంటే, తొంభై ఏడేళ్ళకే 'హరీ'మంది. తన మాతృదేవత సెంచరీ చూడకుండానే 'టపా'కట్టడానిక్కారణమైన నన్ను మా నాన్న, మా బాబాయిలు శత్రువులా చూశారు. మా చెల్లెళ్ళు వాళ్ళ ఐదారేళ్ళ ఆడపిల్లలను చూపించి 'మా కూతుళ్ళ పెళ్ళిళ్ళయిపోయేదాకా పెళ్ళి చేసుకోవేంట్రా అన్నయ్యా?' అని హాస్యమాడుతున్నారు. పైగా బ్రహ్మచారి వెధవ్వి, నీకేం సమస్యలుంటాయి? అంటారు ప్రతిదానికీ? ఎన్నని చెప్పను?''

ఓ సాయం సంధ్యలో ఎప్పటిలానే పార్కులో కూర్మావతారం పల్లీలు నములుతూ, గడ్డిపరకలు పీకుతున్న సుకన్యని మాటల్లో పెట్టి, ఆమెకు పెళ్ళి పట్ల గల విముఖతకి కారణాలను క్యాచ్ చేయగ



ల్గాడు. సుకన్య అక్కయ్యని, వరసకి బావైన రామలింగం ప్రేమించి, పెద్దల్ని ఎదిరించి మరీ, కట్నం లేకుండా పెళ్ళి చేస్కున్నాడు. ఓ ఏడాది కాపురంతో ఆమెపై మోజు తీరిపోయాక వాళ్ళ వాళ్ళతో కల్సి కట్నం తేలేదని, తాను డిమాండ్ చేసివుంటే, పెద్దకట్నం వచ్చేదని, భార్యని సాధించి వేధించటం మొదలెట్టాడు. కూతురు కష్టపడుతుంటే చూడలేక పండుగలు, కానుకల రూపంలో పరోక్షంగా ముట్టచెబుతూనే వున్నారు సుకన్య తల్లిదండ్రులు. అది చాలక ఇద్దరాడపిల్లలను కన్న పాపానికి, మగపిల్లాడ్ని కనడం చేత కాలేదని సాధించారు. అదేదో ఆమె చేసిన తప్పే అన్నట్లు. మూడవసారి స్కానింగ్ రిపోర్టులో ఆడపిల్లేనని తెలియటంతో అబార్షన్ చేయించారు. ఇవన్నీ తెలిసి టీచర్ ట్రైనింగ్ కోసం అక్క దగ్గరికి వెళ్ళిన సుకన్యకి అక్కయ్య కష్టాలు, ఆ యింట ఆమె అనుభవిస్తున్న హీనమూ చూసి 'ఛ! లవ్ మారేజి అన్న పదానికి అర్థాన్నే చంపాడు బావ' అనుకుంది. ''సుక్కూ! నువ్వు జీవితంలో ప్రేమించకు. ప్రేమించినా, పెళ్ళి చేసుకోకు! పెళ్ళి ప్రేమని చంపేస్తుంది. పెళ్ళనే పద్మవ్యూహంలోకి నువ్వు ప్రవేశించకు. కురు సేనలంతా కల్సి అభిమన్యుణ్ణి చుట్టిముట్టి హతమార్చినట్లు, పెళ్ళి తర్వాత పరిణామాలు ప్రేమనీ హతమారుస్తాయి. ఇది నా అనుభవసారం!'' అన్న అక్కయ్య మాటలు సుకన్య బుర్రలో బాగా నాటుకుపోయాయి. కానీ కూర్మావతారం కల్మషంలేని ప్రేమని కాదనలేక, ఆమోదించింది. ఇదొక్కటే కాక సుకన్య క్లోజ్ ఫ్రెండు అపర్ణ మారీడ్‌లైఫ్ కూడా ఇందుకు భిన్నంగా లేదు. పెళ్ళికి ముందు నీకోసం ఏమైనా చేస్తానని, ఆమెని ప్రేమించే పెళ్ళి చేసుకున్న అప్పారావు పెళ్ళయ్యాక పెళ్ళాన్ని సినిమాకి తీసికెళ్ళాలన్నా, వాళ్ళమ్మ పర్మిషన్ కావాలనేవాడు. కొడుకు మెతకతనాన్నడ్డం పెట్టుకుని, అతడి తల్లిదండ్రులు అపర్ణని సాధించటం మొదలుపెట్టారు. అది తేలేదనీ, ఇది తేలేదనీ, కొడుకుని అమాయకుడిని చేసి, వలలో వేసుకుందనీ, లేకుంటే, బోల్డన్ని కట్నకానుకలు వచ్చేవనీ, వాళ్ళకి అపర్ణమీద కోపం. అపర్ణకీ, సుకన్యకీ అర్థంకాని విషయమదే! పెళ్ళికాముందు 'నీకోసం ఏమైనా చేస్తా'నని ప్రగల్భాలు పలికినవాడు, పెళ్ళికాగానే వాళ్ళ వాళ్ళలో చేరి, అపర్ణని ఎందుకు సాధిస్తున్నాడు? ''మగాళ్ళంతా ఇంతే సుకన్యా! ఎలాగోలా పెళ్ళి చేసుకుంటే చాలు! ఆ తర్వాత మనం చచ్చినట్లు, ఎలాంటి పరిస్థితులకైనా తలవంచి పడివుంటామన్న నమ్మకం. అనాదిగా మగాడు స్త్రీని అణచివేస్తున్నాడు. మోసం చేస్తున్నాడు. నువ్వైనా, తెలివిగా నడుచుకో సుకన్యా! మగాడి తియ్యటి మాటలు నమ్మి మోసపోకు. ప్రేమించకు. ప్రేమించినా, పెళ్ళి చేసుకోకు!'' అని హితబోధ చేసిందపర్ణ కూడా. అపర్ణకాపురం చూసిన సుకన్య ఛస్తే లవ్ మ్యారేజి చేసుకోకూడదని ఒట్టేసుకుంది.

**ఎస్.విజయలక్ష్మీప్రసాద్**

'అయితే ఆ అప్పారావుగాడూ, ఈ రామలింగంగాడూ అనే రాహుకేతువులన్నమాట నా పెళ్ళిలో నిప్పులు పోసింది. చెప్తా! ఈ వ్యవహారాన్నెలా నరుక్కు రావాలో నాకు తెల్సు' అనుకుంటూ పళ్లు నూరుతున్న కూర్మావతారంతో,

''అదేంటి కూర్మం! అంతలా పళ్లు కొరుకుతున్నావు? జాగ్రత్త. వూడిపోగలవు! రేపట్నుండి బఠాణీలు తినలేవు, పళ్ళూడిపోతే!'' అన్నది సుకన్య.

''ఇక ఈ పార్కులో బడి బఠాణీలు తినే అవసరం లేదులే!'' అన్నాడు లేస్తూ కూర్మావతారం.

''అదేవిటీ?''

''అదంతేలే పద! చెప్తా'' అన్నాడు.

★ ★ ★

రాత్రి ఏడుగంటలప్పుడు పరీక్ష పేపర్లు దిద్దుతోంటే, సుకన్య బావ రామలింగం నుండి ఫోన్ కాల్. ''హలో సుకన్యా! పరీక్షలైపోయినయ్‌గా. సెలవులకి రారాదూ! ఓ వారం వుండి వెళ్ళొచ్చు. చంటిదాని బర్త్‌డే పార్టీ ఎల్లుండి. ఫస్ట్ బర్త్ డే అంత బాగా సెలబ్రేట్ చేసుకోలేదు గదా! ఈసారి గ్రాండ్‌గా చేద్దామనుకుంటున్నాం! నువ్వు తప్పకుండా రావాలి. పెద్దది నీకోసం కలవరిస్తోంది. మీ అక్క సరేసరి. వీలైతే 'ఊటీ' ట్రిప్ ప్లాన్ చేస్తున్నా. సరదాగా వెళ్ళొద్దాం!'' అంటూ చెబుతూంటే ఆశ్చర్యపోయింది సుకన్య. 'ఇలా మాట్లాడుతోంది బావేనా? అక్కయ్య రెండ్రూపాయల మల్లెపూలు కొంటే లెక్క చెప్పమనేవాడు బర్త్‌డే పార్టీ గ్రాండ్‌గా చేస్తున్నాడా? అలాంటి పార్టీలవీ దండుగ ఖర్చు

లని, అక్కయ్యకి లెక్చర్లిచ్చేవాడు. కొంచెం మారా డేమో, మహానుభావుడు' అని అనుకుంది. మర్నాడు ఉదయం పదకొండు గంటలకి అక్కయ్య ఫోన్ కాల్. ''హలో సుక్కూ! నిన్న మీ బావగారి ఇన్విటేషన్ అయిందా! ఇపుడు నాదీ. తప్పకుండా రావే. మీ బావగారెంత మారిపో యారో తెలుసా, నువ్వు చూస్తే ఆశ్చర్యపోతావు. అన్నట్లు మేం వేరే ఇల్లు తీసుకున్నాం పాత ఇల్లు చాలటం లేదని. మా అత్తగారు, మామగారు వాళ్ళ చిన్న కొడుకు దగ్గరకెళ్ళారు. ఇకనుండీ ముగ్గురు కొడుకుల దగ్గరా , ఏడాది లెక్కన వుంటారుట. ఇదంతా మీ బావగారి నిర్ణయమే. ఏ దేవుళ్ళ దయ వల్లో ఆయన మారారు సుకన్యా! ఇప్పుడు నన్నెంత ప్రేమగా చూసుకుంటున్నారో నువు చూస్తేగానీ, నమ్మవు'' వింటున్న సుకన్య 'ఇదికలా, నిజమా?' అనుకుంది. అక్కయ్య గొంతులో ఆనందాన్ని చూసి మురిసిపోయింది. వెళ్ళి, స్వయంగా దాని కాపురాన్ని చూసి రావాలి- 'గంగి గోవు'లాంటి అక్కయ్యనెన్ని కష్టాలు పెట్టారు వాళ్ళు? పోన్లే! దాని మంచితనమే, దానికి 'శ్రీరామరక్షైంది' అని కూడా అనుకుంది.

సుకన్యని సాదరంగా ఆహ్వానించాడు రామలింగం. అనుకున్నట్లే, పార్టీ గ్రాండ్‌గా జరిగింది. మాటల తోనూ, చూపులతోనూ హడల గొట్టే అక్కయ్య అత్తగారు లేకపో వటం ఎంతో రిలీఫ్‌గా వుంది సుక న్యకి. ఎంతో పీనాసితనంతో వ్యవహ రించే రామలింగం బర్త్‌డే పార్టీనింత ఆర్భాటంగా చెయ్యటం ఆశ్చర్యమే కల్గించింది సుకన్యకి. ముఖ్యంగా ప్రతి దానికీ అక్కయ్యనే సంప్రదిస్తూ తాన న్నింటికీ భార్యమీదే ఆధారపడతా నని అందరికీ గొప్పగా చెప్పుకుం టున్న బావగారి వైఖరిలో వచ్చిన మార్పుకి అచ్చెరువొందింది సుకన్య. అక్కయ్య మొహంలో ఆనందం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. సుకన్య వున్న వారం రోజుల్లోనూ వూటీ వెళ్ళొచ్చారు. మరునాడు ఆమె ప్రయాణ మనగా, ఖరీదైన సిల్క్ చీర పెట్టించాడు రామలింగం భార్యతో, సుకన్యకి. ''సుకన్యా! మీ అక్కయ్య దేవత. ఇన్నాళ్ళూ మా అమ్మానాన్నల మాట విని ఆమెనెంతో కష్టపె ట్టాను. జన్మనిచ్చింది కన్నవాళ్ళే అయినా కలకాలం వెంటనడిచేది, కష్టసుఖాల్లో తోడు, నీడగా వెన్నంటి వుండేది కట్టుకున్న భార్యే అని ఇప్పటికి గ్రహించాను. కన్నవాళ్ళపట్ల నాకెంత బాధ్య తుందో, నాతోడబుట్టిన వాళ్ళకూ అంతే బాధ్యతుందనీ, అంచేత మా ముగ్గురిళ్ళల్లోను, పెద్దాళ్ళు ఏడాది, ఏడాది లెక్కన వుండాలని ఒప్పందం చేశాను. అనుకోకూడదుగానీ మా జీవి తాల్లో సుఖశాంతులు లేకుండా చేసింది మా అమ్మే!'' అన్నాడు.

గుక్కతిప్పుకోకుండా అతడిచ్చిన ఉపన్యాసాన్ని వుత్కంఠభరితంగా విన్నారు అక్కాచెల్లెళ్ళు. ''ఆఫీ సుకెళ్ళొస్తా! ఎంచక్కా మీరిద్దరూ కబుర్లు చెప్పు కోండి. సాయంత్రం సినిమాకి వెళ్దాం'' అంటూ వెళ్ళిపోయాడు. తలుపేసొచ్చిన అక్కయ్యతో ''ఇన్నాళ్ళకు నీ కష్టాలు తీరాయక్కా! బావగారిలో ఇంతమంచి మార్పెలా వచ్చిందంటావే?'' అడి గింది సుకన్య.

''సుక్కూ! సంసారంలో భర్త అనురాగానికీ సుఖ శాంతులకూ, ఎవరేనోము నోయాలంటే అదల్లా చేశా. ఏ నోముల, వ్రతాల ఫలితమో గానీ ఆయన మారారు. నాకంతే చాలు.

అయినా సంసారమన్నాక చీకటి వెలుగుల్లా కష్టసు ఖాలూ సహజమే. నన్ను ప్రేమించి మరీ పెళ్ళి చేస్కున్న మీ బావగారెప్పటికైనా మారి నన్నర్థం చేస్కుంటారన్న నా నమ్మకం గెల్చింది. కష్టాలు కలకాలముండవు. సుఖాలు వాటిని వెన్నంటే వుంటాయి. సుక్కూ! కూర్మావతారం బుద్ధిమంతుడుగాబట్టే ఇన్నాళ్ళూ నీకోసం కాచుక్కూర్చు న్నాడు.

అతగాడి ప్రేమలో నిజాయితీ వుంది. మీ ప్రేమ జయిస్తుంది. త్వరలో పెళ్ళి చేసుకో. ప్రేమ రెండు మనసులను కలిపితే, పెళ్ళి రెండు జీవితాలను కలుపుతుంది. ప్రేమికులుగా మనసులు కలుపుకున్న మీరు పెళ్ళితో మీ జీవితాలను పెనవేసు కోండి''

అక్కయ్య మాటలు మెల్లగా మన సులో నాటుకుపోసాగాయి సుకన్యకి.

స్కూలు పిల్లలతో వైజాగ్ ఎక్స్‌కర్ష న్‌కొచ్చిన సుకన్య, రిటర్న్‌లో హెడ్ మిస్ట్రెస్ పర్మిషన్‌తో తన ఫ్రెండు అపర్ణ ఇంటికెళ్ళింది.

''హాయ్ సుక్కూ! నువ్వొచ్చావే, చాలా సంతో షంగా వుందే. ఒక వారం వుండి వెళ్ళు. మీ పేరెం ట్స్‌కి ఫోన్ చేయొచ్చులే. ఇంతకీ మీ హెచ్.ఎమ్. పర్మిషనిచ్చిందా?'' అడిగిందపర్ణ ఫ్రెండుని ఆప్యాయంగా రిసీవ్ చేసుకుని.


''నేను ముందే చెప్పాలే. అది సరేగానీ ఈ ఇంటి కెపుడుమారారు? మీ అత్తగారు, మామగారు ఏరీ? అసలెందుకిల్లు మారారు? అది మీ స్వంత ఇల్లేగా?'' అడిగింది సుకన్య, కొత్త ఇంటిని పరిశీల నగా చూస్తూ. ''చాలా చెప్పాలే నీకు! ఆయనకి వాళ్ళ పేరెంట్స్‌తో పడలేదు.

నేనెంత బాగా చూస్తున్నా వాళ్ళు నన్ను సాధిం చటం, కట్నకానుకలు తేలేదని, ఫ్రీగా వచ్చిన నౌక రులా ట్రీట్ చెయ్యటం ఇవన్నీ చూసి ఆయన భరించలేకపోయారు. అందుకనే వేరు కాపురం పెట్టేశారు''

''ఈ బుద్ధి ముందరేమయింది? అప్పుడు వాళ్ళ తోకల్సి, వాళ్ళకి తాన, అంటే తందాన అని తాళం కొట్టాడుగా. పెళ్ళాం విలువేంటో ఇప్పటిగ్గానీ అర్థం కాలేదా?'' వెటకారంగా అడిగింది సుకన్య.

''అర్థం అవబట్టే ఒక్కగానొక్క కొడుకైనా వాళ్ళని తీర్థయాత్రలకి పంపించి, వాళ్ళొచ్చేసరికి వేరే ఇల్లు మకాం మార్చేశారు. నెలైంది వాళ్ళు వెళ్ళి. అట్నుంచి మా ఆడపడుచు దగ్గరికి ముంబై వెళ్ళారు. మరో నెలదాకా రారు. ఇన్నాళ్ళూ నాచేత అడ్డమైన ఊడిగం చేయించుకున్నారు. అంత చేస్తున్నా తమ కొడుకుని వలలో వేసుకుని, వాజ మ్మని చేసి ఆడిస్తున్నానీ, అదనీ నామీద నిందలు. వాళ్ళు తిరిగొచ్చాక అర్థమవుతుంది. నా విలు వేంటో! ఏదేమైనా నా కష్టాలు గట్టెక్కాయ్. ఇప్పుడు నేనేమంటే, ఆయనకదే వేదం. రోజా ఒక్కటే నసపెడ్తుంటారు. ఇన్నాళ్ళూ నిన్నర్థం చేసుకోక కష్టపెట్టాను. నన్ను క్షమించు అప్పూ!'' నవ్వుతూ చెప్తున్న అపర్ణ కళ్ళలో కొత్త కాంతులను చూసింది సుకన్య.

''సుక్కూ! అగ్నిసాక్షిగా, వేదమంత్రాల సాక్షిగా, తన అర్థభాగంలా వచ్చి, అర్థాంగియైన ఇల్లాలిని



## దశ తిరుగుతుందా?

**అరవై రోజుల పాటు నిర్విరామంగా జరిగిన షూటింగ్‌తో 'కోయీ మిల్ గయా'చిత్రం షూటింగ్ పూర్తయింది. రాకేష్ రోషన్ నిర్మాతగా షర్మిష్ట రాయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సొట్టబుగ్గల సుందరి ప్రీతిజింతా, రేఖ, హృతిక్‌రోషన్, ప్రేం చోప్రా, ముఖేష్ రిషి, అంజనా ముంతాజ్, జానీ లివర్‌లు నటిస్తున్నారు. త్వరలో విడుదలకి సిద్ధం అవుతున్న ఈ చిత్రం ప్రీతికి మంచి బ్రేక్‌నిస్తుందంటున్నారు.**

ఒకప్పుడుగాకపోతే ఒకప్పుడైనా అర్థం చేసుకుని ఆదరించకపోడు భర్తగా మారిన ఏ మగాడూ. నా దురదృష్టవశాన అది కొంచెం ఆలస్యమైందంతే. సుక్కూ! జీవితంలో పెళ్ళికి ఒక అర్థం, అంతరార్థం వున్నాయి. లేనిపోని అపోహలతో, వయసునంతా వ్యర్థంగా గడిపేసుకున్నావు. ఇకనైనా, పెళ్ళి చేసుకుని స్థిరపడు. కన్నవాళ్ళు కలకాలం నీతోడుండరు. పెళ్ళితో ప్రేమ బలపడుతుందేగానీ, బలహీనమవదు. ఒకప్పటి నా అనుభవంతో నేనన్న మాటలు మర్చిపో. ఈరోజు నేను చెప్పినవి జీవితానుభవంతో చెప్పిన సత్యాలు.'' అప్పర్ణ మాటలకి సుకన్య ఆలోచనలోపడింది.


తర్వాత సుకన్య అక్కడున్న నాల్గురోజుల్లోనూ అప్పారావు అప్పర్ణ కొంగు పట్టుకుని తిరగటమేగాక ''ఆమె తన పూర్వజన్మ సుకృతంకొద్దీ తనకర్థాంగి అయిందనీ ఒక్కగానొక్క కొడుకునని ఇన్నాళ్ళూ తన వాళ్ళకు తాళం కొట్టాననీ ఇక వాళ్ళ మాట వినేది లేదనీ'' అతడు చెబుతోంటే, 'ఆ అప్పారావితడేనా అన్నంత ఆశ్చర్యంతో కళ్ళు విప్పార్చుకుని అప్పర్ణవంక చూసింది సుకన్య. ముగ్గురూ భీమ్లీ, బొర్రాకేవ్స్ చూసొచ్చారు. కేవ్స్ దగ్గర అప్పర్ణ కాలు బెణకడం, తన అదృష్టంగా భావించి, రెచ్చిపోయి, ఆమెని కాలు కింద పెట్టనీకుండా సేవలు చేసి, సుకన్య దగ్గర మంచి మొగుడికేయాల్సిన మార్కులు వేయించుకున్నాడు. హెల్ప్ చేయబోయిన సుకన్యని వారించి, ''నేను వంటలో నలభీముణ్ణని రుజువు చేసుకునే ఛాన్స్ వచ్చింది నాకు! మీరు అప్పూకి బోర్ కొట్టకుండా, కంపెనీ ఇవ్వండి చాలు'' అన్నాడు. ఆమె బయల్దేరేరోజు, అందమైన రాధాకృష్ణుల శాండల్ వుడ్ బొమ్మ ప్రజెంటేషన్‌గా ఇచ్చి ''చూడండి సుకన్యగారూ! ఏ మగాడికైనా తనకు నచ్చిన స్త్రీ భార్యగా దొరకటం ఒక అదృష్టమైతే, ఆమెని ప్రేమించి, ఆమె ప్రేమని పొందటం మరీ అదృష్టం. అలా ప్రేమించి, పెళ్ళి చేసుకున్న అర్థాంగిని నూటికి తొంభై తొమ్మిది మంది ప్రేమికులు సుఖపెట్టాలని, ఆమె అడుగుజాడల్లో నడవాలనే అనుకుంటారు. నేనూ ఇప్పుడు కళ్ళు తెరిచాను. నావాళ్ళనెదిరించైనా, నా అప్పూని సుఖపెడ్తాను!'' అన్నాడు అప్పర్ణనారాధనగా చూస్తూ.

★ ★ ★

అక్కయ్య, అప్పర్ణల మాటలు పదే పదే చెవుల్లో రింగుమంటున్నాయి సుకన్యకు. 'కన్నవాళ్ళు కలకాలం తోడుండరు. జీవితాంతం తోడు, నీడగా కల్సివుండేది భార్యాభర్తలే! పెళ్ళితో ప్రేమ బలపడుతుందేగానీ, బలహీనమవదు. అనవసరమైన భయాలతో, అనుమానాలతో, వయసంతా వ్యర్థం చేసుకున్నావే' అన్న మాట మరీ గుర్తొస్తోంది. పర్యవసానంగా, ఒక శుభముహూర్తాన ఆమె పెళ్ళికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో ఆర్భాటంగా కూర్మావతారంతో పెళ్ళి జరిగి అటు పెద్దలూ ఇటు పెద్దలూ ఆనందంగా అక్షింతలేసి, గాలి పీల్చుకున్నారు. కూతురి పెళ్ళికని, బ్యాంకులో వేసిన లక్షన్నరా కూర్మావతారం వొద్దంటున్నా, బలవంతంగా అల్లుడి చేతిలో పెట్టాడు సుకన్య తండ్రి. తమ తమ పాత్రల్లో, ఏ టీవీ యాక్టర్‌కీ తీసిపోని విధంగా నటించేసి జీవించేసిన అప్పారావు, రామలింగాలకి పాతికేసి వేలకి చెక్కులు చేతిలో పెట్టిమరీ, శోభనం గదిలో దూరాడు కూర్మావతారం.

★ ★ ★

''చెల్లెలి పెళ్ళి వంక పెట్టుకుని, దర్జాగా వారం రోజులిక్కడ సుఖపడదామనుకుంటున్నావేమో! రేపు రాత్రికే మా అమ్మా, నాన్నా దిగుతున్నారు. బట్టలు సర్దు. మా అమ్మ కీళ్ళ నెప్పులతో కూచుని లేవలేదు. నీకు తెల్సు కదా! అక్కడ నీ బాబొచ్చి చేస్తాడా మావాళ్ళకి?'' పరకాయ ప్రవేశమంత వేగంగా నాటకంలోంచి జీవితంలోకొచ్చేసి, అలవాటైన రంకెలు మొదలెట్టిన రామలింగాన్ని చూసి ఆశ్చర్యంతో నోరు తెరిచింది సుకన్య అక్క నీలవేణి.



పాతింటి ముందు ఆటో ఆపించిన భర్త అప్పారావుతో ఆశ్చర్యంగా అన్నది అప్పర్ణ. ''అదేవిటీ? మనం వేరే ఇల్లు తీసుకున్నాంగా! ఇక్కడెందుకాపించారు?''

''నోర్మూసుకుని ముందు దిగి, లగేజీ లోపలికి పట్టుకురా'' వురిమి చూస్తూ అన్నాడప్పర్ణతో.

ఆటోవాడికి డబ్బులిచ్చి పంపేసి, తాళం తీసి లోపలికెళ్ళాక అన్నాడు. ఊళ్ళో సొంతిల్లు, అమ్మానాన్నలనొదిలేసి, ఏ వెధవైనా అద్దింటికెళ్తాడా? ఎవడో హెన్ పెక్డ్‌లాంటి ఆడంగి వెధవ తప్ప. నేనేదో మారిపోయి నీ కొంగు పట్టుకుని తిరుగుతానని కలలు కనకు. అదంతా నీ ఫ్రెండుకి పెళ్ళిమీదున్న హేట్రెడ్ పోగొట్టి, కూర్మావతారంతో పెళ్ళికొప్పించటానికాడిన నాటకం. నా నాటకం దెబ్బకి నువ్వూ, నీ ఫ్రెండూ ఫ్లాటయిపోయారు. పూర్ లేడీస్! ఇట్టే నమ్మేస్తారు. నటనేదో, నిజమేదో కూడా పోల్చుకోలేని అమాయకులు''

''పోన్లెండి అంతా మనమంచికే అన్నట్టు మీ ప్రేమనాటకానికి నేను మోసపోయినా మా సుక్కూకి మంచే జరిగింది. దాని మనసు మార్చుకుని ఓ ఇంటిదయింది. అద్సరే! ఆ కూర్మావతారం మీద మీకంత ప్రేమెలా కల్గింది? అతడు మీకెలా తెల్సని?''

''వెధవనుమానాలూ నువ్వూనూ! వాడూ నేనూ మూడో క్లాసునుండీ, ఏడో క్లాసు దాకా కల్సి చదువుకున్నాం. అనుకోకుండా ఈమధ్యే రైల్లో కలిశాం'' అందంగా అబద్ధాలాడేశాడప్పారావు, జేబులో చెక్కుని చేత్తో తడుముకుంటూ. ✪

## లేడీ అమితాబ్ ఆశలు

**హీరోయిన్‌కి కొత్త అర్థం తెచ్చిన ఘనత విజయశాంతికే చెందుతుంది. విజయశాంతి చిత్రాలంటే తెలుగు ప్రేక్షకులకి ఎంతో ఆసక్తి. 'కర్తవ్యం', 'నేటి భారతం', 'ఓసేయ్ రాములమ్మ' తరహాలో మరో సెన్సేషనల్ చిత్రంలో ఆమె నటిస్తోంది. 'ఇందిరమ్మ' అని పేరు పెట్టిన ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పాత్రని ఆమె పోషిస్తోంది. మాధవసాయి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి వందేమాతరం శ్రీనివాస్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. విజయశాంతి ఇమేజ్‌కి తగినట్టుగా ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారీ చిత్రాన్ని. పూజా భారతి, అనితా పటేల్‌లు ఆమెకి చెల్లెళ్ళుగా నటిస్తున్నారు. చాలా కాలం తరువాత వస్తున్న ఈ మాస్ చిత్రంపై విజయశాంతి కూడా ఆశలు పెట్టుకుంది.**